ప్రజాశక్తి
శనివారం 6 జులై 2024 5 అనంతపురం

పర్సా సత్యనారాయణ జీవిత విశేషాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

టిబి డ్యామ్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

◆ తుంగ నుంచి దిగువకు నీరు
◆ హెచ్‌ఎల్‌ఎంసిపై పెరుగుతున్న ఆశలు
◆ పంట సాగుకు కలిసొచ్చే అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్నాయి. మొన్నటి వరకు డ్యామ్ పైభాగంలో వర్షాల్లేక నీరు అట్టడుగు స్థాయికి చేరింది. ఐదు టిఎంసిల్లోపే ఉంది. గడిచిన రెండు రోజులుగా తుంగ పైభాగంలో వర్షాలు పడటంతో తుంగభద్ర డ్యామ్‌కు నీరు పుష్కలంగా వచ్చాయి. దీంతో తుంగ డ్యామ్ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. 21 గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు 19 వేల క్యూసెక్కులకు నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం పది టిఎంసిలకు చేరింది. రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

హెచ్‌ఎల్‌ఎంసిపై ఆశలు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ ఏడాది 26 టిఎంసిలు నీటి కేటాయింపులను జూన్ మాసంలో జరిగిన మొదటి తుంగభద్ర బోర్డు మీటింగ్‌లో నిర్ణయం చేశారు. రెండో సమావేశం సమయానికి నీటి కేటాయింపులపై స్పష్టత రానుంది. జూన్ మొదటి వారంలో మంచి వర్షాలు పడినప్పటికీ అప్పటి నుంచి వర్షాల్లేకపోవడంతో తుంగభద్ర డ్యామ్‌లో నీరు పూర్తి స్థాయిలో రాలేదు. దీంతో జులైలో అయినా నీరు డ్యామ్‌కు వస్తుందా లేదా అన్న సందేహం నెలకొని ఉండింది. రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు ఇన్‌ఫ్లోస్ పెరుగుతుండటంతో హెచ్‌ఎల్‌ఎంసిపై ఆశలు రేకెత్తాయి. సాధారణంగా జులై 20వ తేదీ నుంచి జిల్లాకు నీరు తీసుకోవాలని సాగునీటి అధికారులు అంచనా వేశారు. ఇప్పుడొచ్చే నీళ్లతో ఆ సమయం నుంచి నీటిని విడుదల చేయించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది వర్షాభావంతో నీరు తగినంత రాలేదు. 26 టిఎంసిలు వస్తాయనుకుంటే 16 టిఎంసిలే వచ్చాయి. ఈ ఏడాది అయినా పూర్తి స్థాయిలో నీరు జిల్లాకు చేరితేగాని కష్టాలు తప్పేలాలేవు. ఎందుకంటే జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. నీరు పూర్తి స్థాయి అడుగంటాయి.

ఆయకట్టు రైతుల్లో ఆశలు

జులై 20 నుంచి తుంగభద్ర ప్రధాన కాలువ నీరొస్తుందని భావించి ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు నార్లు పోసుకుంటున్నారు. సకాలంలో వస్తే ఆయకట్టు రైతులు ఈసారి పూర్తి స్థాయిలో పంటలు సాగు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది సకాలంలో నీరు రాక చివరి ఆయకట్టు రైతులకు నీరందక నార్లు ముదిరిపోవడంతో పంటలు సాగు చేసుకోలేదు. ఈసారైన నీరు వచ్చి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరందుతుందని ఆశాభావంతోనున్నారు. ఒకవైపు వర్షాలు జిల్లాలో జూన్‌లో బాగా పడిన ఆ తరువాత నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మేఘాలు కమ్ముకుని వస్తున్నా వర్షం పడటం లేదు.

పోరాటాల దిక్సూచి 'పర్సా'

◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు
◆ అనంతలో పర్సా సత్యనారాయణ శతజయంతి సభ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, శ్రామికులు, కర్షకుల న్యాయమైన హక్కులు సాధన, ప్రజా సంక్షేమానికి అనుసరించాల్సిన ఐక్యతా పోరాటాలకు సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ దిక్సూచిగా నిలిచారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు తెలిపారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికోద్యమ నిర్మాత, మార్క్సిస్టు యోధుడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభను శుక్రవారం నాడు అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆహ్వానితులుగా, జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసింగరావుతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్సా సత్యనారాయణ జీవిత విశేషాలు, పోరాటాలు, సాధించిన విజయాలను పొందుపరిచి రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నరసింగరావు మాట్లాడుతూ ఊపిరి పోయేంత వరకు సమాజం, శ్రామిక, కార్మిక వర్గం పక్షాన పరితపించారని కొనియాడారు. కార్మిక వర్గం పెరగాలని, వారికి రాజ్యాధికారం లభించినప్పుడు ఆ ప్రాంతం, ఆ రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధిస్తుందన్న సిద్ధాంతాన్ని నమ్మి అనుసరించిన గొప్ప నాయకుడన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం, సింగరేణి బొగ్గు గనుల కార్మికుల హక్కుల సాధన, కనీస వేతనాల పెంపుదల కోసం చేసిన పోరాటాలు చారిత్రకంగా నిలిచాయని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పేద వాడి భూమి పేదలకే చెందెలా అలుపెరగని పోరాటం చేశారని, ఎంతో మంది రైతులకు భూములు పంపిణీ చేశారని గుర్తు చేశారు. పర్సా సత్యానారాయణ, సిఐటియు ప్రధాన కార్యదర్శి నండూరు ప్రసాదరావులు ఆంధ్ర మహాసభ పేరుతో పోరాటం చేసి పటేల్ పట్వారీ వ్యవస్థను నిర్మూలించగలిగారని తెలిపారు. ఎమర్జెన్సీలోనూ అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగారని తెలిపారు. జైలు జీవితాన్ని గడిపారని, ఎన్నో కష్టాలు భరించి అలుపెరగని పోరాట యోధుడిగా ప్రజలు, కార్మికుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సాధన పోరాటాల్లో తనదైన పాత్ర పోషించాడని తెలిపారు. పెట్టుబడిదారీ విధానం నాశనం చేసి వర్గ పోరాట సిద్ధాంతం రావాలనే కాంక్షతో పోరాడారని తెలిపారు. కార్యకర్తలు నాయకులుగా కావాలని వారందరూ రాజ్యాధికారం చేపట్టాలనే సంకల్పంతో పని చేశారని తెలిపారు. పర్సా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్మికుడు, నాయుడు కావాలని, పేదరికం, శ్రమ దోపిడీ, అన్యాయం నిర్మూలంచి సమసమాజ స్థాపనకు ముందుకు సాగుదామన్నారు. నేడు సిఐటియు బలమైన సంఘంగా నిలిచిందంటే పర్సా వేసిన పోరాట మార్గమే అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లడుతూ సమాజంలో దోపిడీ వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ రూపుమాపేందుకు పర్సా చేసిన పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచాయని తెలిపారు. జిల్లాలో సిఐటియు తొలి సమావేశానికి పర్సా హాజరై ఉత్తేజాన్ని నింపారని గుర్తు చేశారు. ఆయనతో కలిసి పని చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. పర్సా సత్యనారాయణ ఆశయాల సాధనకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, జిల్లా నాయకులు గోపాల్, రమాదేవి, శంకుంతల, కె.నాగభూషణ, ఎటిఎం.నాగరాజు, ఎజి.రాజమోహన్, జమున తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలి

ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి

మట్టి నమూనాలను తీసుకుంటున్న ఆత్మా పీడీ మద్దిలేటి

ప్రజాశక్తి-నార్పల

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే రైతులు ఎరువులు వాడాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 'స్కూల్ సాయిట్ హెల్త్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 8, 9, 10, తరగతి విద్యార్థులకు మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లపల్లికి చెందిన రైతుల పొలాల్లో దాదాపు 50 మట్టి నమూనా శాంపిల్స్ తీసి భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. మట్టి నమూనా పరీక్షల అనంతరం అందుకు అనుగుణంగా రైతులు ఎరువులను వాడాలని సూచించారు. భూ సారంలో ఉండే పోషకాల విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకుని ఎరువులు వాడితే దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రోజా పుష్పలత, అనంతపురం వ్యవసాయ అధికారి నాగేంద్ర, మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, బండ్లపల్లి రైతుసేవా కేంద్రం శశిధర్, సిద్ధరాచెర్ల రైతుసేవా కేంద్రం కుపేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన

ఉరవకొండ : ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామ సచివాలయంలో రియో అగ్రో ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మల్లెల జగదీష్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, గ్రామ పెద్దలు పంపాపతి, కామాటం శ్రీనివాసులు, బండారు సురేష్, బాబు, రైతులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులు చేపట్టాలి

నిధులు లేకపోతే భిక్షాటన చేసి ఇస్తాం.. : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వర్షాకాలం ప్రారంభం కావడంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, మండల నాయకులు సి.నాగేంద్ర, సంజీవరెడ్డి, నెట్టికంటయ్య, పుల్లయ్య, వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ అధికారులు విషజ్వరాలు, డయేరియా నివారించాలన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు విన్నవిస్తే కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు లేవని చెప్పడం బాధాకరమన్నారు. బుక్కరాయసముద్రంలో గతనెల రోజుల నుంచి జ్వరాలు, విరోచనాలు ఎక్కువ కావడంతో పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లీచింగ్ పౌడర్ కొనడానికి, డ్రెయినేజీ కాలువల్లో స్ప్రే చేయడానికి మందులు, ఫాగింగ్ ఆయిల్ కొనడానికి అవసరమైతే సిపిఎం ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంటల బీమాలో రైతులకు భారం లేకుండా చేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమాను నూతన విధానాలతో అమలు చేసే ఆలోచన మంచిదేనని.. అయితే బీమా చెల్లింపులో రైతులపై భారం పడకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పంటలు వేసి నష్టపోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బీమాను ప్రకటించడం ద్వారా కొంతమేర రైతాంగం ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అయితే నూతన విధానాలతో పంటల బీమాను అమలు చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వం మాదిరి బీమా చెల్లింపులో రైతు వాటా లేకుండా ప్రభుత్వాలే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఎడిఎ లక్ష్మానాయక్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎడిఎ లక్ష్మానాయక్ హెచ్చరించారు. శుక్రవారం రాయదుర్గంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు, ఎరువుల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు సలహాలు, సూచనల కోసం 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, డీలర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడిఎ లక్ష్మానాయక్

ఎంపిడిఒ సుబ్బరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

'ఉపాధి' కూలీలకు వేతనాలు చెల్లించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 25వేల మంది ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్నారన్నారు. వీరందరికీ 8 వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా పనుల వద్ద కనీస సౌకర్యాలు, నీడ, నీళ్లు, మెడికల్ కిట్లు, పనిముట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉపాధి హామీ కూలీ కుటుంబ సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పించి, అడిగిన వారందరికి ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పనులు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.2లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురళి, నాయకులు రవికుమార్, వీరాంజనేయులు, చాపల లాలెప్ప, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెన్నోబిలేసుడిని దర్శించుకున్న ఐడిఎఎస్ డైరెక్టర్ అరుల్ నందన్

పూజలు చేస్తున్న ఐడిఎఎస్ డైరెక్టర్ అరుల్‌నందన్

వజ్రకరూరు : పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామిని ఐడిఎఎస్ డైరెక్టర్ అరుల్‌నందన్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్, ఎంపిడిఒ సుబ్బరాజు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గూగూడు ఉత్సవాలకు పటిష్ట చర్యలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

గూగూడులో అగ్ని గుండంను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల నిర్వాహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం గూగుడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఆలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. ఉత్సవాలకు మూడు రాష్ట్రాల నుంచి దాదాపు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం పకడ్బందీగా అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్యూలైన్ల నిర్వహణ, ఇతర సేవ చేసేందుకు సేవాదళ్ పేరుతో బందాన్ని తయారు చేయాలన్నారు. గ్రామంలో వీధుల్ని 100 మీటర్లకు ఒక సెక్టార్ చొప్పున మ్యాప్ చేయాలన్నారు. 24 గంటల్లోగా సెక్టార్ మ్యాపు సిద్ధం కావాలన్నారు. ప్రతి సెక్టార్‌కి సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, అంగన్వాడీ వర్కర్, ఎఎన్ఎం, సిహెచ్ఒ, తదితర అధికారులు బందాలుగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఒక సెక్టార్‌కి ఒక లౌడ్ స్పీకర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా విద్యుత్, ఇతర వైర్లు వేలాడకుండా లైన్మెన్‌లతో పరిశీలన చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకోవాలన్నారు. చక్కెర ప్రసాదం ప్యాకింగ్ చేసి ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. బస్సులు, ఇతర వాహనాలపై ఉత్సవాల పోస్టర్లు, ఫ్లెక్సీలు అతికించేలా చూడాలన్నారు. అవసరమైన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజూ ఒక జిల్లా అధికారి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తాగునీటిని సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం నుంచి 80 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ ఆర్ఎం తెలియజేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ గ్రామంలో కాలినడకన పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామి దేవాలయాల్లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, ఆర్డీవో జి.వెంకటేష్, సర్పంచి రమణకుమారి, డిపిఒ ప్రభాకర్ రావు, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా॥కిరణ్ కుమార్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా మలేరియా అధికారి జి.ఓబులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఆర్అండ్‌బి ఎస్ఇ ఓబుల్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఏవో సాకేతపురం శోభ, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేష నాయుడు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు, సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మొక్కలను నాటడంతోపాటు సంరక్షించడం సామాజిక బాధ్యత అని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఆర్కే నగర్‌లోని ఇందిరాగాంధీ మున్సిపల్ పాఠశాలలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాబోయే తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. పరిసరాల పచ్చదనంతో ప్రజల జీవనం ఆరోగ్యకరంగా, ఆనందకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు కూడా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, ఏసీపీ హరిప్రసాద్, ఇఇ సూర్యనారాయణ, డీఈ రవీంద్రారెడ్డి, ఏడీ లక్ష్మీప్రసన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మేయర్ వసీం, విద్యార్థులు

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

పుట్లూరు : మండల పరిధిలోని చింతకుంట, కందికాపుల గ్రామాలకు శాశ్వత నీటి పరిష్కారం కోసం తాడిపత్రి మండలం ఎగువపల్లి గ్రామం నుంచి పైప్‌లైన్ పనులు ప్రారంభం అయ్యాయి. ఈపనులను సర్పంచి శివరామయ్య శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామాల్లో తాగునీటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో పైప్‌లైన్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వజ్రకరూరు : డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను చేపట్టినట్లు ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండలోని 11వ వార్డులో కాలువలను శుభ్రం చేశారు. అలాగే కాలువల్లో మిలాతిన్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. అంతేగాకుండా ఫ్రైడే ను ఫ్రైడే గా పాటించాలన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు ఇదే సమయం

కేంద్రంపై టిడిపి ఒత్తిడి చేయాలి
చిరుద్యోగులు, కార్మికులపై దాడులు, తొలగింపులు సరికావు
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'దేశంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఇందులో రాష్ట్రం నుంచి టిడిపి కీలకంగా నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ఇదే సరైన సమయం. ఈ మేరకు టిడిపి కేంద్రంలోని బిజెపిపై ఒత్తిడి తేవాలి.' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రం సిఐటియు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, కార్మికులు, రైతుల నమ్మకాలను వమ్ము చేయకుండా పరిపాలించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. పరిశ్రమల స్థాపన, నీటి వనరుల అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తే విరివిగా పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి కేంద్రం విరమించుకున్నట్లే ప్రకటించాలన్నారు. విశాఖ ఉక్కును పునరుద్ధరించే బాధ్యతను చంద్రబాబు తీసుకోవాలని సూచించారు. వేల కోట్లు అప్పులు చేసి ఎగ్గొట్టిన కంపెనీలకు రాయితీలిచ్చిన కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమకు సంబంధించి ప్రతి పైసా అప్పును వసూలు చేయించడం దుర్మార్గం అన్నారు. రాయలసీమలో పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతం అని, ఉన్న వాటిని అభివృద్ధి చేసి, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అభివృద్ధిలో రాయలసీమ అగ్రస్థానంలో నిలిచే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసిందన్నారు. అదానీ సంస్థకు కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అప్పనంగా అప్పగించేసిందన్నారు. ఇప్పుడు పెన్నా సిమెంట్ మెడపై కత్తి పెట్టి రాకుండా చంద్రబాబు ఎన్డీఏ ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని కోరారు. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చిరుద్యోగులు, కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర కార్మికులపై వేధింపులు, దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి వాటిని నివారించాల్సిన బాధ్యత చంద్రబాబు ఉందన్నారు. దాడులు, వేధింపులు లాంటి చర్యలకు పాల్పడడం వల్లే గత వైసిపి ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, ఇప్పుడు టిడిపి అవే విధానాలు అవలంభిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. వైసిపి కార్యాలయాల కూల్చివేతలు సరికాదన్నారు. విద్యుత్ రంగంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ, పంచాయతీ తదితర రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి గత ప్రభుత్వం ఒప్పందాలు చేసింది, ఆ ఒప్పందాలను యథావిధిగా ఈ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శులు ముర్తుజా, వెంకటనారాయణ పాల్గొన్నారు.

రావూరి భరద్వాజకు నివాళులర్పిస్తున్న జాషువా సాహిత్య పీఠం సభ్యులు

బహుముఖ ప్రజ్ఞాశాలి 'రావూరి భరద్వాజ'

ప్రజాశక్తి-అనంతపురం

ప్రముఖ తెలుగు నవల రచయిత, కవి, విమర్శకుడు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు కొనియాడారు. రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్, జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, డాక్టర్ నాగిల నాగేంద్ర, పూజారి ఈరన్న, బండి వసంతకుమార్, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సి.ఎస్.శ్రీనివాసులు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వేయాలని వినతి

పామిడి : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఎంపియుపి పాఠశాల వద్ద, బీసీ కాలనీలో వీధిలైట్లు వేయాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అదేవిధంగా సుంకులమ్మ ఆలయం దగ్గర మురుగు కాలువలను శుభ్రం చెయించాలని కోరారు. ఇందుకు పంచాయతీ సెక్రటరీ స్పందిస్తూ త్వరలోనే వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని, ఆలయం దగ్గర మురుగు కాలువలు కూడా శుభ్రం చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రమేష్, రామాంజనేయులు, రాఘవేంద్ర, భాస్కర్, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువను శుభ్రం చేయాలని వినతి

డ్రెయినేజీని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పామిడి : మండల కేంద్రంలోని 18వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు వార్డు ఇన్‌ఛార్జి నల్లబోతుల శీన శుక్రవారం వార్డులో పర్యటించి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని విన్నవించగా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ బొమ్మా మోహన్, బూత్ కన్వీనర్లు రామాంజనేయులు, చిరంజీవి, శ్రీరాములు, సుంకప్ప, బెస్త హరి, సంజీవ, ఎర్రిస్వామి, సుబ్బు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు సన్మానం

శానిటరీ ఇన్స్‌పెక్టర్ దంపతులను సన్మానిస్తున్న దశ్యం

గుత్తి : శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందడంతో మున్సిపల్ కార్యాలయంలోని సభా మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ దంపతులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కమిషనర్ జి.శ్రీనివాసులు, కౌన్సిలర్ ఫారూఖ్ తో పాటు పలువురు శాలువా, పూలమాలలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటరెడ్డి, టిపిఎస్ మహబూబ్ జాన్, వివిధ విభాగాల అధికారులు ఇమామ్ హుస్సేన్, షేక్షావలి, సికె. రామాంజనేయులు, పల్లవి, పర్వీన్, పుట్టరాజు, సంజీవ రాయుడు, చంద్రకళ, రాజగోపాల్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు డ్రై ల్యాండ్ కింద పండ్ల తోట పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పంచాయతీకి వందశాతం రాయితీతో పండ్ల మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌లో దూరవిద్య కోర్సులు

కళ్యాణదుర్గం : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ నుంచి 8 వారాలపాటు ఆన్‌లైన్‌లో దూరవిద్య వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాధాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, పట్టు పురుగుల పెంపకం వంటి కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోనే నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్ కోరారు. అదనపు సమాచారం కోసం సెల్..80087 88776 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గంగవరం పాఠశాలను విలీనం నుంచి మినహాయించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్

అనంతపురం క్రైం : బెళుగుప్ప మండలంలోని గంగవరం ప్రాథమిక పాఠశాలను విలీనం నుంచి శాశ్వతంగా మినహాయించాలని రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం విలీనమైన గంగవరం పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 117 మేరకు గతంలో గంగవరం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను స్థానిక ఉన్నత పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీంతో 3, 4, 5వ తరగతుల్లో చదివే 50 మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఉన్నతపాఠశాలకు పంపడం లేదన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి గంగవరం ప్రాథమిక పాఠశాలను విలీనం నుంచి శాశ్వతంగా మినహాయించాలని డిమాండ్ చేశారు.

డివైఇఒగా నాగరాజు

గుత్తి : జిల్లా ఉప విద్యాధికారిగా వి.నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డివైఈవోను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుభాన్, ఉషారాణి, ఉపాధ్యాయుడు దేశాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డివైఇఒను కలిసిన ఉపాధ్యాయులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి

శింగనమల మండలం పోతురాజుకాలువలో చిన్నారులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి

ప్రజాశక్తి-శింగనమల

ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతురాజుకాలవ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు నీరు నిల్వ చేయకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాగేశ్వరమ్మ, టి.ప్రశాంతి, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో అమిద్యాలలో అతిసార నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగారంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పిలు భవాని, చాముండేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : డ్రైడేను పాటించి మలేరియా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విస్తరణాధికారి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాలువపల్లి హనుమరెడ్డిపల్లి, దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు వెంకటేశులు, శ్రీరాములు, ఉమాదేవి, జగదీష్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎల్ఈఆర్‌టి పరిశీలకులు కేశవరెడ్డి

విద్యావ్యవస్థను పటిష్టం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే..
ఎస్ఎల్ఈఆర్‌టి పరిశీలకులు కేశవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యా వవస్థను పటిష్ట పరిచే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్ఎల్ఈఆర్‌టి పరిశీలకులు కేశవరెడ్డి అన్నారు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ ఈనెల 1 నుంచి జిల్లాలోని ఉపాధ్యాయులకు 10వ తేది వరకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణా తరగతులు శుక్రవారం 5రోజుకు చేరుకున్నాయి. ఈ శిక్షణా తరగతులను ఎస్ఎల్ఈఆర్‌టి పరిశీలకులు కేశవరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు అంకిత భావంతో పని చేయాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఓ చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ బాబ్జీ నాయక్, బాలాజీ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి : ఎస్ఐ

పెద్దపప్పూరు : గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ గౌస్‌బాషా సూచించారు. శుక్రవారం మండలం పరిధిలోని ధర్మాపురం, షేక్‌పల్లి గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను సృష్టించుకోకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. అంతకుముందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : జెవివి

రాయదుర్గం : వాంతులు, విరేచనాలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బిఎం.నాదల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దోమకాటు వల్ల విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉన్నందున జాగ్రత్త వహించాలన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కలరా, డయేరియా వ్యాధి సోకిన వారు ఎక్కువ నీటిని తాగాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలను శుభ్రం చేసుకుని వంట వండిన తర్వాత వేడిగా ఉన్నప్పుడే తినాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బేడ బుడగ జంగం కుటుంబ సభ్యులు

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బేడ బుడగ జంగం కుటుంబాలు శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిసి విన్నవించాయి. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు రాయదుర్గం నాగయ్య, బలగల్ల జమ్మన్న, పెద్ద బాలయ్య మాట్లాడుతూ 40ఏళ్ల నుంచి రాయదుర్గంలో జీవనం సాగిస్తున్నప్పటికీ తమకు ఉండటానికి ఇల్లు లేదన్నారు. బొంత డేరాల్లో నివసిస్తున్నందున విష పురుగులు, ఎలుకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, వన్నూరుస్వామి, ఆనంద్, మారేష్, శంకర్, శివయ్య, వెంకటేశులు, సురేష్, రామాంజి, వెంకీ, శేఖర్, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగు పరచాలి
మంత్రికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి

మంత్రిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గ పరిధిలోని బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు. ఈమేరకు పెనుకొండలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే శింగనమల మండలంలో గూగూడు ఈనెల 7వతేదీ ప్రారంభం కానున్న కుళ్లాయిస్వామి బ్రహోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి బండారు లీలావతి, సోదరుడు పాల్గొన్నారు.

ఇవిఎంలు బద్దలు కొడితే తప్పు కాదా జగన్..:దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : ఇవిఎంలను బద్దలుకొట్టడం తప్పు కాదా.. జగన్.. అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. ఎమ్మెల్యే అయితే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఇవిఎంలు పగులగొట్టొచ్చా.. అని నిలదీశారు. దీన్ని సమర్థించిన జగన్‌పై కూడా ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు అందరి ముందూ ఇవిఎం ధ్వంసానికి పాల్పడ్డారని గుర్తు చేశారు. సీసీ పుటేజ్‌లో కూడా స్పష్టంగా బయటపడిందన్నారు. అలాంటి నేరస్థుడైన వ్యక్తిని జగన్ ఎలా వెనకేసుకు వస్తారని ప్రశ్నించారు. అసలు ఆయనకు ప్రజాస్వామ్యం అంటే తెలుసా అని నిలదీశారు.

ప్రపంచ స్థాయిలో పోటీపడాలి : కమిషనర్

కమిషనర్‌ను సన్మానిస్తున్న ఐటిఐ కళాశాల సిబ్బంది

అనంతపురం : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎదుగుతున్న ప్రపంచం స్థాయిలో మనం పోటీ పడాలని మున్సిపల్ కమిషనర్ మేఘుస్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బాలుర ఐటిఐలో టాటాస్ట్రైక్, ఏమెక్స్, ర్యాయల్ వెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఇష్టమైన రంగాన్ని ఎంపిక చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంసి సభ్యులు శేషాలు క్రియాణ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్, ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

వజ్రకరూరు : ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఉరవకొండ తాలూకా అధ్యక్షులుగా హెచ్.ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల వెంకటేసులుతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. ఉరవకొండ తాలుకా కార్యవర్గాన్ని జిల్లా కన్వీనర్ ఎస్ఎండి షఫీ ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండలోని సిహెచ్‌సి ప్రాంగణంలో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.వేణుగోపాల్, రాఘవేంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఎస్ఎండి షఫీ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయ పరమైన హక్కుల సాధనకు నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు.

ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

భారత ఫుట్‌బాల్ జట్టుకు ద్వారకనాథ్‌రెడ్డి

అనంతపురం : అనంతపురానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు ద్వారక హరినాథ్‌రెడ్డి కుమారుడు ద్వారకనాథ్‌రెడ్డి భారత జట్టుకు ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హబీబుల్లా, కార్యదర్శి నరేంద్రచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారక్‌నాథ్‌రెడ్డి ఈనెల 9న శ్రీలంకలో జరిగే ఎస్ఎబిఎ కప్ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

జాతీయ వ్యాయామ క్రీడలకు విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయ వ్యాయామ క్రీడలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తిరుమల అనే విద్యార్థి షాట్ పుట్, షావెలెన్, డిస్కస్ త్రో (అథ్లెటిక్స్)లో ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడు. దీంతో ఆ విద్యార్థి జాతీయస్థాయి వ్యాయామ క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 16న జరిగే వ్యాయామ క్రీడా పోటీల్లో తిరుమల పాల్గొంటాడని పాఠశాల హెచ్ఎం సుభాన్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

మామను హత్య చేసిన అల్లుడు

మృతిచెందిన లక్ష్మన్న

గుంతకల్లు రూరల్ : భార్యాభర్తల పంచాయితీలో తనను అవమానించాడని పిల్లనిచ్చిన సొంత మామనే కిరాతంగా నరికి చంపిన ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని నల్లదాసరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆవుల లక్ష్మన్న (50) మూడేళ్ల క్రితం తన కూతురు లలితమ్మను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దోల్తాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహమైన ఆరునెలల వరకూ కాపురం సజావుగా సాగింది. అప్పటి నుంచి చంద్రశేఖర్ రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఇందులో భాగంగానే వారం క్రితం భర్తతో గొడవపడి లలిత పుట్టింటికి వెళ్లింది. ఈ విషయమై పంచాయితీ జరుగుతుండగా చంద్రశేఖర్ తన ఆరు నెలల పాపను తన వెంట పంపి మీ కూతురే మీ వద్దే పెట్టుకో అంటూ తెగేసి చెప్పాడు. దీంతో మామ లక్ష్మన్న ఆరు నెలల పాపను తల్లి నుంచి విడదీసి ఎలా పెంచుతావంటూ కోపంగా మాట్లాడాడు. దీన్ని అవమానంగా భావించిన చంద్రశేఖర్ తన అనుచరులు రామాంజనేయులు, సతీష్‌తో కలిసి గ్రామ శివారులో గురువారం రాత్రి కాపు కాసి గుంతకల్లు నుంచి ద్విచక్ర వాహనంలో ఊరికి వస్తున్న లక్ష్మన్నను వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. బంధువుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

లోహిత్‌కుమార్ (పాతచిత్రం

గుంతకల్లు : పట్టణంలోని బీరప్ప కాలనీలో నివాసం ఉంటున్న లోహిత్‌కుమార్ (24) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు 2వ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ ప్రయివేటు ద్విచక్ర వాహనాల షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్న లోహిత్ కుమార్‌కు రెండేళ్ల క్రితం ఎమ్మిగనూరు చెందిన లక్ష్మీదేవితో వివాహమైంది. పెళ్లయిన కొన్ని నెలల నుంచి భార్య అనేక విషయాల్లో లోహిత్ కుమార్‌ను వేధింపులకు గురిచేస్తూ ఉండేది. దీనికితోడు ఏడాది క్రితం వీరికి సంతానం కలిగి మృతిచెందింది. అప్పటి నుంచి పుట్టింటికి వెళ్లిన ఆమె భర్త పిలిచినా కాపురానికి రాలేదు. దీంతో ఇరు కుటుంబాలు పోలీసుల సమక్షంలో పంచాయితీ కూడా చేశారు. ఈనేపథ్యంలో మనస్థాపానికి గురైన లోహిత్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మృతుడి కుటుంబ సభ్యులు లోహిత్ కుమార్ మృతికి కారణమైన భార్య లక్ష్మీదేవిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆసపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడు మృతి

శింగనమల : మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికుడు మొండిపోగుల గంపన్న శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. గంగన్నకు రెండు రోజుల కిందట కడుపునొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పట్నం నగేష్, బాల సత్యమూర్తి, పట్నం నరేష్, అవిలిగొండ ఆదీష్, తదితరులు గంపన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా
ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ